


# పిల్లలను మరిచిపోతే ఎలా...

సుమైత్రాంగి

అద్దంముందు నిలబడి తల దువ్వుకుంటున్న విశ్వం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు అనుమానం తీరక మళ్ళీ మళ్ళీ చూసుకున్నాడు తలని. అవును నిజంవే. తనతలలో తెల్లవెంద్రుక తొంగిచూస్తున్నది. అప్పుడే తను ముసలివాడై పోతున్నాడా? ఛ! తనకింకా నలభై నిండలేదు అప్పుడే ముసలి తనమా! అతనికి నమ్మకం కలగడంలేదు. నిన్నో మొన్నో పెళ్ళయి నట్లు, ఉద్యోగంలో ప్రవేశించినట్లుగా వుంది మనసుకి కాని తలప్పుడే, 'నీ తల పండి పోతున్నదోయ్' అని హెచ్చరిస్తున్నట్లు ఈ తెల్ల వెంద్రుక...అతనికి బాధగావుంది, దిగులుగానూ వుంది. ఆ తెల్లవెంట్రుకను తీసేస్తే. చాలాసేపు తంటాలుపడగా దాన్ని లాగివేయగలిగాడు.

"ఇవ్వాళ ఆఫీసు లేదా! లేక శలవు పెట్టారా!" అంటూ వచ్చింది శారద.

నీ ముఖారవిందం చూస్తూ కూర్చోమని మా ఆఫీసు మొగుడు శలవిచ్చాడులే" వెటకారంగా అన్నాడు విశ్వం.

"నా ముఖం చూస్తే ఏం బాగుంటుంది. ఆఫీసులో లేడీటైపిస్టు ముఖం అయితే బాగుంటుందిగాని" ముడుచుకున్న మొహంతో రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది శారద

అనవసరంగా భార్యామణి మనసు నొప్పించినందుకు మనసు మూలిగింది బాధగా.

ఆఫీసులో కూర్చున్నా అతని మనసు పనిమీద లగ్నం కావడంలేదు. మాటి మాటికి ముడుచుకున్న భార్య ముఖమే గుర్తువస్తున్నద తనికి. ఛ నా కీ మధ్య మరీ విసుగు ఎక్కువై పోతున్నది. ఇప్పుడే ఇలావుంటే మరీ వయసు పెరిగే కొలదీ ఇంకెలా వుంటాడో' అనిపించింది. వృద్ధాప్యం వస్తున్న లక్షణాలంటె ఇవే' అంది మనసులో మరో బొమ్మ.

వృద్ధులు వరసగా గుర్తురాసాగారు అతనికి. నడుం వంగి శరీరం ముడుతలుపడి, అడుగులు తడబడ్తూ. వణికే దేహంతో, కర్రను తాటించుకుంటూ నడిచిపోతున్నారు అతని మనోనేత్రం ముందు. రేపు తన స్థితీ అలాగే అవుతుందా? అందులో సందేహం ఏంవుంది? మానవుడి చివరిదశ వృద్ధాప్యమే కదా. ఏ అదృశ్యశక్తో చెవిప్రక్కన అరిచినట్లు వూహించుకున్నాడు. మొహం వివర్ణమయ్యింది.

"అలా వున్నారేం విశ్వంగారూ, వంట్లో బాగాలేదా?" అడిగాడు ఆనంద మోహన్.


'అబ్బే! నాకేం బాగానే వున్నానే' తడబడ్డాడు విశ్వం.

"కూతురి పెళ్ళిగురించి ఆలోచిస్తున్నారేవో గురువుగారు" సుదర్శన రావు నవ్వేడు.

ఆ మాట ఛెళ్లున తగిలినట్లు వులిక్కిపడ్డాడు విశ్వం.

"నేను ముసలివాడినై పోతున్నానే" అనే తపనేగాని, తన కూతురు పెళ్ళి కెదుగుతున్నదనే సంగతే మర్చిపోయాడేం తను దానికి పధ్నాలుగు వెళ్ళి పదిహేను వస్తాయి రేపో మాపో, ఈ ఏడు కాకపోతే ఆ పై ఏడన్నా దానికి పెళ్ళి చేయకతప్పదు. ఆ తర్వాత దానికి పిల్లలుపుడ్తే అప్పుడన్నా తను తాతగారు అవ్వక తప్పదుకదా ఛ ఛ...తను అప్పుడే పెళ్ళిచేసుకోకుండా వుండాల్సింది. ఈ పెద్దవాళ్ళకి అస్సలు బుద్ధి వుండదు లోకజ్ఞానం సరిగ్గా తెలియక ముందే ముచ్చటపడి పెళ్ళి జరిపించేస్తారు. ఆ వెంటనే పిల్లలు పుట్టుకొస్తారు. ఎవరి కొంపో మునిగిపోయినట్లు, నలభై ఏళ్ళన్నా నిండకుండానే తాతలు, మామ్మలు అయిపోతున్నారు తనలాంటి వారంతా. ఆఫీసరుగారు, ఎంచక్కా ముప్ఫై అయిదో ఏట పెళ్ళిచేసుకున్నారు నలభై దాటాకే తండ్రి అయ్యాడు. డెబ్బయ్యోపడిలో తాత అవుతాడు అదృష్టం అంటే అటువంటి వారిదేను" బరువుగా నిట్టూర్చేడతను.

'గురువుగా రివ్వాళ ఏదో దీర్ఘాలోచనలో పడ్డారుగాని సుదర్శనరావు, లేడీ టైపిస్టు లిల్లీకి ఏదో సైగచేసాడు అ అమ్మాయి జవాబుగా నవ్వింది సిగ్గుగా. విశ్వం తలెత్తిచూసేసరికి వాళ్ళిద్దరూ కళ్లతోనే మాట్లాడుకుంటూ ముసి ముసి




నవ్వులు గ్రుమ్మరించు కుంటున్నారు తనివితీర. ఇంకా పెళ్ళికాని పడుచుపిల్లలు వాళ్లు. 'అదృష్టవంతులర్రా మీరు' వాళ్లని లోలోపలే అభినందించాడు విశ్వం మూడుగంటలు కాకుండానే కుర్చీలోంచి లేచిన ఆనందమోహన్, "ఈ ఫైలు కాస్త సరిచేసి ఆఫీసరుగారికి పంపిం చండి విశ్వంగారూ, ఈ పూట కాస్త తల నాదుగా వుంది," అన్నాడు విశ్వాన్ని చూస్తూ.

"అన్నీ అబద్ధాలే గురువుగారూ మిసెస్ ఆనంద్‌గారిని, సినిమాకు తీసు కెళ్ళాలని ఆ కంగారు" వున్నమాట బైట పెట్టి అల్లరిగా నవ్వేడు సుదర్శనరావు.

అతనివైపు ఉరిమిచూస్తూ "అతని మాటలు నమ్మకండి విశ్వంగారూ. ప్లీజ్, ఆ ఫైలు చూస్తారుగా? వెళ్ల మంటారా నన్ను" అంటూనే దొంగ నవ్వుతో జారుకున్నాడు ఆనంద మోహన్. అతని కీ మధ్య పెళ్ళయింది. భార్య కాపురానికొచ్చిందీ వారంలోనే. ఆ వయసులో అది సహజమే మరి. సరదా లన్నీ ఇప్పుడు తీరకపోతే ఇంకెప్పుడు తీరుతాయి? రెండేళ్లుపోతే, చంకలో పిల్లాడు, కొంగుపట్టుకుని ఓ పిల్లాడు. వీళ్ళతో ఇంకేం సరదాలు తీరతాయి, అని నవ్వుకున్న విశ్వం, ఆనందాన్ని వయసు ఉద్రేకాన్ని ఇప్పుడే అనుభ వించండోయ్ అనాలనుకున్నాడు. కాని అప్పటికే బైటకు దూసుకుపోయాడు ఆనంద్.

అయిదు కొట్టింది గడియారం. ఫైల్స్ అన్నీ కట్టకట్టి బీరువాలోపెట్టి తాళంవేసి బైటకొచ్చాడు విశ్వం. రోడ్డు మీద జనం హడావిడిగా తిరుగుతున్నారు. నీరసంగా, ఉత్సాహంగా, కంగారుగా, ఇలా ఎందరో, ఎన్ని రకాల భావాల తోనో వెళ్తున్నారు. వీళ్లల్లో ఎంతమంది సంతోషంగా వున్నారు? ఇంకెంతమంది

దుఃఖితులో అతని ఆలోచనకు అతనికే నవ్వు వచ్చింది.

అతనికప్పుడే ఇంటికెళ్ళాలని అని పించలేదు. వంతెన దిగువగావున్న పార్కులోకెళ్ళి కూర్చున్నాడు. అక్కడా ఖాళీలేదు. ఒకే జనసమ్మర్ధంగా వుంది. చిరుతిళ్ళు అమ్మే వ్యాపారస్తులతో. వాళ్ల అరుపులతో, పిల్లల కేరింతలతో చాల సందడిగావుంది ఓ మూలగా బెంచిచూసు కునికూర్చున్నాడు విశ్వం. వేరుశనక్కా యలు అమ్మే కుర్రాడు 'కొంటారా సార్' అంటూ వచ్చాడు. అక్కర్లేదు అన్నట్లు తలవూపాడతను ఎక్కడో అడవి మూర్ఖుడిలా వున్నాడే అన్నట్లు మొహం పెట్టి మరోచోటి కెళ్ళిపోయాడు వేరు శనక్కాయల వ్యాపారి.

అతని వెనకాల మాటలు విని పిస్తున్నాయి. "ఈ వేరుశనక్కాయ లంటే మీ అత్తమ్మగారికెంత యిష్టం అనుకున్నావూ, ఓ పావలా కాయలివ్వ వోయ్ అలా కాదు పొట్లంకట్టి ఇవ్వు. వాటిని చూస్తే మీ అత్తమ్మ ఎంత సంతో షిస్తుందనుకున్నావూ." విశ్వం గబు క్కున వెనక్కి తిరిగి చూసాడు

ఓ తలనెరిసిన వ్యక్తి, అతనికి సుమా రుగా ఏభై ఏళ్ళు ఉంటాయేమో ఓ తల నెరవని వ్యక్తి అతనికి సుమారుగా ఇరవై ఏళ్ళు ఉంటాయేమో, కూర్చుని వేరుశన క్కాయల ఫలహారం భోంచేస్తున్నారు


"పెళ్ళి అయిన కొత్తలో అయిన అలవాటు ఇప్పటికీ పోలేదోయ్ నాకు. ఇంటికి వెళ్తూ ఓ పావలా చిరుతిండీ ఓ పావలా పూలూ పట్టుకెళ్తుంటా నిప్పటి కీను" అతని గొంతులో గర్వం తొంగి చూస్తున్నది

అదీ ఓ గొప్పేగా, అలా చెప్పుకో డానికి సిగ్గువేయడంలేదు కాబోలు అత నికి ఆ పెద్దతన్ని మనసులోనే ఏవ గించుకున్నాడు విశ్వం

పెళ్ళయిన కొత్తలో అందరూ అలాగే చూసుకుంటారు పెళ్ళాల్ని. బజార్లో కనిపించే వస్తువులన్నీ కొని భార్యకు ఇవ్వాలని, ఆ సమయంలో భార్య కన్నుల్లో కనిపించే సంతోషాన్ని, ప్రేమను చూసిఆనందించాలని పెళ్ళయిన ప్రతి యువకుడూ తలపోస్తాడు. దానిలో వింతేముంది? అదీ ఓ పెద్ద ఘనకార్యంలా వుంది కాబోలు ఈయనకు.

పెళ్ళయిన కొత్తలో తనూ శారదకు చిన్న చిన్న కానుకలను సమర్పించుకునే వాడు. శారద వాటిని అందుకుంటూ "ఎందుకండీ అనవసరంగా డబ్బు పాడు చేస్తారు వీటికి" అని గోముగా అంటుంటె తన ఛాతీ ఆనందంతో ఉబ్బేది ఆ అలవాటు ఎప్పుడెలా పోయిందో తనకు గుర్తులేదు. బహుశా రెండో సంతానం పుట్టాక పోయింది కాబోలు. ఇప్పుడు ఇంటికి వెళ్తూ పూలు పట్టుకెళ్ళటంకూడా జరగదు.

అప్పుడప్పుడూ ఆఖరిపిల్ల "నాన్నా




నాకు మిఠాయిలుతేవూ, బొమ్మలుతేవూ" అంటుంది.

'అలాగేనమ్మా, తెస్తాలే' అంటాడు. అంతే. అంతవరకే ఇంటికెళ్ళేప్పుడు ఆ మాట గుర్తుండదు ఓ వేళ గుర్తున్నా పట్టుకెళ్ళడం ఇష్టం వుండదు

అతను లేచాడు. బజార్లోంచి నడక సాగించాడు అటూ ఇటూ దుకాణాలు, కొన్ని మిఠాయి దుకాణాలు, మరికొన్ని బట్టల షాపులు, పాపులర్ షూమార్టులు, ఫ్యాన్సీ ఎంపోరియమ్స్, బాంగిల్స్, పూల అంగడులు దాటిపోతున్నాయి. ఫ్యాన్సీ ఎంపోరియమ్‌లోకి వెళ్ళి పిల్లలకేమైనా ఆటవస్తువులు కొంటే? అత నాగాడు ఆ షాపుముందు చాలామంది వున్నారు ఓ తల్లీ కొడుకూ ఆ షాపులోంచి ఇవతల కొచ్చారు. కుర్రాడిచేతిలో చిన్న ఆట కారువుంది ఆ పసివిల్లాడికి ఆ కారుని రోడ్డుమీదే నడపాలని ఉబలాటంగా వుంది. "ఇప్పుడు వద్దు, ఇంటి కెళ్లాక ఆడుకుందువుగాని" అని తల్లి వారిస్తున్నా వినకుండా ఆ బొమ్మకి కీ ఇచ్చి కింద వదిలాడు. అది బర్రున దూసు కెళ్ళింది ఓ రిక్షా కిందికి. దాన్ని తెచ్చు కోడానికి ఆ కుర్రాడు వేగంగా దూసు కొచ్చే చిన్నకారుని చూడకుండా ముందుకు పరుగెత్తాడు కన్నుమూసి తెరిచే లోపలే జరగబోయే ప్రమాదం నుంచి మెరుపులా అడ్డుకుని ఆ కుర్రాడిని కాపాడినాడు విశ్వం

ఆ తల్లి ఎంతో కృతజ్ఞతగా చూసింది అతనివైపు వాడి ఆత్రానికి చిహ్నంగా ఆ ఆటబొమ్మ మాత్రం రిక్షాచక్రంకింద పడి ముక్కలైపోయింది ఆ దృశ్యం చూసిన విశ్వానికి ప్రాణం ఉసూరుమంది. నయం బొమ్మలు కొన్నాడు కాదు తన పిల్లలు ఈ కుర్రాడిలాంటి వారేను. తెల్లవారేసరికి విరిచి పోగులు పెట్టేవారేను. అతని కాళ్లు ముందుకి సాగాయి.

అతనికి శారద జ్ఞాపకం వచ్చింది.

ఆమె మనసుని అనవసరంగా నొప్పించి నందుకు పరిహారంగా ఏదైనా చీర కొంటే కాని అంత డబ్బు ఉంటుందా ఈనెలాఖరిరోజుల్లో అతను జేబు తడువుకున్నాడు. పర్సు తేలిగ్గావుంది. పోనీ ఏ జాకట్టుగుడ్డో కొంటే. ఇప్పుడు ఏం పండుగని కొంటావు? భార్యకు కొంటే పిల్లలకు కొనక్కర్లేదా? అంతకన్నా తేలిగ్గావుండే పువ్వులో, మిఠాయిలో కొని తీసుకెళ్ళరాదా?" సౌదుపుని పాటించే మనను హెచ్చరించిందలా. అతనికి ఆ ఆలోచనే వచ్చింది. మిఠాయి అంగడి దగ్గర ఆగి ఓ రూపాయి జీడిపప్పు పకోడి, బందరు లడ్డు పొట్లం కట్టించాడు. ఓ అర్ధరూపాయిపెట్టి పూలు తీసుకున్నాడు. ఈ పూలు, పిల్లలంతా నిద్రపోయాక భార్య తలలో పెట్టాలనే లాలస కలిగింది. తనులా తలలో పూలు పెట్టుంటే భార్య ఏమంటుందో? బహుశా "పిల్లలై పోతున్నారేం ఇంత వయసు వచ్చినా" అంటూ సిగ్గుపడ్తుందేమో. భార్యా' తనూ అలా ఏకాంతంగా కూర్చుని కబుర్లు చెప్పుకుని ఎన్ని సంవత్సరాలయ్యింది. నాటికి నేడు అటువంటి సమావేశం జరగనున్నది. అతనికి మన సంతా తేలిగ్గా, నిర్వచించలేని ఆనందంతో నిండిపోయింది.

అతను గుమ్మంలో కెళ్లేసరికి పాత మిత్రుడు ప్రకాశం కనిపించాడు అతనితో మాట్లాడ్తూ నిల్చున్నాడు. మాటల సందట్లో చిన్నకొడుకు వచ్చి తన చేతిలోని పాకెట్లు తీసుకెళ్ళడం అతను గమనించలేదు.

మాటలు ముగించి అతనటు వెళ్ళగానే విశ్వం లోపలికివెళ్ళాడు. అప్పుడు గుర్తు వచ్చింది చేతిలోని ప్యాకెట్లు ఎవరు తీసారని. ఈ పిల్లలేమయ్యారబ్బా అనుకుంటూ లోపలిగదిలోకి వెళ్ళాడతను. అక్కడ కనిపించిన దృశ్యం చూస్తూనే నిర్ఘాంతపోయాడు. భార్యను ఆనంద పరచాలని తెచ్చిన మిఠాయి పొట్లాలు విడదీసి మగపిల్లలిద్దరూ మింగుతున్నారు, నాన్నగారెంత మంచివారో అని మురుస్తూ.

మరి పూలపొట్లమో...!అతని కళ్ళు చుట్టూ చూస్తూ గదిలో మూలగావున్న అద్దందగ్గిర ఆగిపోయాయి. పెళ్ళికోసం ఎదురుచూస్తూన్న పద్నాలుగేళ్ళ కూతురు అద్దంముందు నిలబడి తలలో పూలు సవరించుకుంటున్నది నాన్నగారికింత హఠాత్తుగా పిల్లలమీద దయకలిగిందేవిటబ్బా! అనుకుంటూ.

ఆ దృశ్యం చూసినవిశ్వం నీరుకారిపోయాడు. ఉస్సురని నిట్టూరుస్తూ వంటవుంటుందేవో గదిలోకి వెళ్ళాడు ప్రొద్దుటి కోపంతోనే భార్య అనుకున్నాడతను.కాని భార్య మొహం నవ్వుతో కళ కళ లాడ్తూ కనిపించేసరికి ఏదో బరువు తీసేసినట్లు తేలిగ్గా గాలి పీల్చుకున్నాడు.

శారద కాఫీగ్లాసు అందిస్తూ "ఏఁవిటి




విశేషం ఈ రోజు. ఏ లాటరీలో అయినా ప్రైజు వచ్చిందా లేక ప్రమోషనొచ్చిందా అంది నవ్వుతూ.

ఏ గుద్దూలేదు అవి నీకోసంవే తెచ్చాను కాని వాళ్ళు అవి హస్తగతం చేసుకున్నారని చెప్పాలనుకున్నాడు. భార్య చేయిపట్టుకున్నాడు ఇంతలో ఏదో పడిపోతున్నట్లు వచ్చింది. చిన్న పిల్ల "అమ్మా" అని పిలుస్తూ. భార్య చేయివదిలి కంగారుగా కాఫీగ్లాసు నోటి దగ్గర పెట్టుకున్నాడతను.

"మనకి పిల్లలున్నారు. వాళ్ళని మర్చి పోతే ఎలా...' అన్నట్లు గుంభనగా చూసి మొహం దించుకుని వచ్చే నవ్వుని ఆపుకుంది శారద.

పాపం విశ్వం మనసులో భావాన్ని వ్యక్తంచేయలేని స్థితిలో గుటకలు మింగుతూ కూర్చున్నాడు.